# చిలుకా పారిపో...

ఎప్పుడు మోహనరావు ఇంటికి వెళ్ళినా ఆ రామచిలక పలకరించేది. స్పష్టంగా మనిషిలా పలుకులు వినిపించేవి అని చెప్పడానికి వీల్లేదు కాని ఆ ఆకుపచ్చ అందాలరాశి 'రండి రండి రావుగారూ' అంటూ కీచుకీచు పలుకులేవో పలికేది. టపటపమని రెక్కలు విదిలించేది. పంజరంలోని ఈ పక్క కమ్మీల నుండి ఆ పక్క దాకా ఎగిరేది. దాని పంజరమంతా పండ్లముక్కలు, గింజలు చిందరవందరగా పడి ఉండేవి. ఒకమూల చిన్న డబ్బా లాంటి దాన్లో నీళ్ళుండేవి. దాని పలకరింపు వినగానే బయటికి వస్తూ, మోహనరావు "రావుగారా! నమస్కారం! రండి! నాకన్నా ముందు మా రాముడు మీకు స్వాగతం చెప్పాడుగదా!" అని నవ్వుతూ పలకరించేవారు.

ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకునేవారు. ఎవరో కోయవాడిచ్చిన ఆ రామచిలుక వాళ్ళింట్లో సభ్యునిలా మెలిగేది. మోహనరావుగారికి ఒక్కడే కొడుకు. వాడేమో న్యూయార్క్‌లో జియాలజీ ప్రొఫెసర్‌గా ఉండేవాడు. ఆయన, వాళ్ళావిడ, రామచిలుకా, ముచ్చటైన సంసారం. డబ్బు పుష్కలంగా ఉంది. వాళ్ళ కుటుంబ వాతావరణం వెన్నెలమయంగా ఉంటే, మా ఇంట్లో అంతా అమావాస్య కాదుగానీ, సమస్యలమయం. రోగంతో ఉన్న ముసలి తండ్రి. పెళ్ళికాని చెల్లెలు. ఫారెస్టాఫీసులో చాలీచాలని జీతంతో నా గుమాస్తా గిరి. ఇంత బాధల్లోనూ సడలకుండా నెట్టుకొస్తున్న మా ఆవిడ. ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉండే తొమ్మిదేళ్ళ కొడుకు. కూరలు, మందులు, వెచ్చాలు వంటి దైనందిన అవసరానికి కావాల్సినంత డబ్బు లేకపోవడం ఉందే, అంత దౌర్భాగ్యం మధ్యతరగతివాడికి మరొకటి ఉండదు. ఒకవైపు లాక్కుంటే ఇంకోవైపు సరిగా కప్పని దుప్పటిలాటి ఆదాయం. పరిస్థితుల ఇనుపకమ్మీల మధ్య జీవితంనాది.

అన్నిటికన్నా పరమ నరకం మా ఆఫీసులో నరకాసురుడనే ఆఫీసరు పెట్టే నరకయాతన. అడ్డమైన గడ్డీ మేసి, ఎందరి కాళ్ళనో పట్టుకుని పైకెగబాకిన ఆ శాస్త్రీకి ఆయన కింద పనిచేసేవాళ్ళంటే అమిత చులకన భావం.

అతగాడికి ఇంగ్లీషు సుమారుగా వచ్చు. తెలుగు అంతంతమాత్రం వచ్చు. ఎవరినైనా సరే ఏకవచనంతో సంబోధించడం, వాళ్ళు అవమానభారంతో గిలగిలలాడుతుంటే తన శక్తికి తానే మురిసిపోవడం అతని స్వభావం. ఆ గర్వ కాలుష్యంతో నిండిన అతని ముఖం పొంగిపొర్లుతున్న డ్రైనేజి కాలువలా ఉండేది.

ఒకరోజు మధ్యాహ్నం భోజన విరామంలో నేనారోజు దినపత్రికను తిరగేస్తున్నాను. ఉన్నట్టుండి తన గదిలోంచి నోట్లో సిగరెట్‌తో బయటికొచ్చాడాయన. దినపత్రికలో నిమగ్నుడనై ఉన్న నేను అది గమనించలేదు. నా పక్క గుమాస్తా జోగయ్య మోచేత్తో పొడిస్తే తలెత్తిచూసి లేచి నిలబడ్డాను. నావైపు ఉరిమిచూసి లోపలికెళ్ళాడు ఆఫీసరు. కాసేపటికి భటుడు యాదయ్య వచ్చాడు.

"రావుగారూ! సార్ పిలుస్తున్నారు."

నేనురావడం గమనించినా, గమనించనట్లు నటిస్తూ మరోఫైలు చూస్తూండిపోయాడు ఆఫీసరు. అట్లా తన కింద పనిచేసేవాడు గదిలో తివాచీలా, గోడమీది బూజులా పడివుంటే, అది తన పెద్దరికాన్ని పెంచుతుందని ఆయనగారి రాక్షస సైకాలజీ.

పదిపదిహేను నిమిషాల తరువాత ఓ కీటకాన్ని చూసినట్టు నావైపు చూశాడు. "ఏవయ్యా ఇది ఆఫీసా ఇల్లా అన్నాడు" వెటకారంగా.

నేనేమీ జవాబు చెప్పలేకపోయాను.

"ఏం? చెముడా లేక తెలుగు అర్థం కాదా?"

"అది కాదండీ!"

"ఏది కాదండీ! నీకు ముప్పూటలా సరిపడే జీతం ఇస్తుంటే, నీవు దర్జాగా కాలుమీద కాలేసుకుని పేపరు చదువ్‌తావ్. ఇదేం నీ మావగారిల్లనుకున్నావా?

"లంచవర్ కదండీ"

"రెండు తర్వాతకూడా లంచవరేనా?"

"నాకు వాచీ లేదండీ"

"అయితే నాలుగింటిదాకా భోజనంచేస్తూ, కిళ్ళీలు నములుతూ, పేపర్ చదువుకుంటానంటావా?"

"పొరపాటైపోయిందండీ! నేను ఆఫీసు వేళల్లోనే కాకుండా సాయంకాలం లేటైనా పనిచేస్తుంటానండీ!"

"చెయ్యాల్లోయ్! ఎవడికోసం చేస్తావ్! నా ఇంటిపని చేస్తున్నావనుకుంటున్నావా? సర్కారువాడి సొమ్ము తేరగా తినడంలేదూ! అందుకోసం చెయ్యాలి. చెయ్యకపోతే ఛార్జిషీటిచ్చి ఇంటికి పొమ్మంటారు. చేసింది వెధవపని, దానికితోడు నోరు కూడాను. గుమస్తాలకే ఇంత కావరమైతే దేశమెట్లా బాగుపడుతుందయ్యా! వెళ్ళు! ఒళ్ళు దగ్గర పెట్టుకుని మసలుకో!"

నా శరీరం బయటికొచ్చింది. మనస్సు ఉడికి ఉడికి ఊరుకుంది. కేవలం

గుమాస్తాగాడిలా బతుకుతున్న నాకు ఆత్మాభిమానం అనేది ఉండడం లగ్జరీగదా! ఆ లగ్జరీ కావాలంటే ఉద్యోగం ఉండదు మరి!

నేనొక్కణ్ణే అయితే.... నేనక్కడ వాడిని లాగి లెంపకాయకొట్టి రాజీనామా ఉత్తరం వాడిమొగాన పడేసి వచ్చేవాణ్ణి. కానీ నామీద ఆధారపడివున్న వాళ్ళు నలుగురున్నారు. వాళ్ళకోసమన్నా అభిమానం చంపుకు బతకాలి.

అయినా ఇలా చచ్చిపోవడం ఇది మొదటిసారి కాదుగదా!

* * * * * * * * * * *

ఎదురింటి మోహనరావుగారబ్బాయి పెళ్ళికోసం అమెరికా నుండి వచ్చాడు. రంగరంగ వైభవంగా పెళ్ళి జరిగింది.

ఆ అబ్బాయి తన తల్లిదండ్రులతో మీ ఇద్దరు మాత్రం ఒంటరిగా ఇక్కడుండడం ఎందుకు! నాతోపాటు అమెరికా రండి! అని బలవంతం చేయడంతో మోహనరావు, ఆయన భార్యకూడా బయలుదేరారు.

వెళ్తూ వెళ్తూ "మా రాముణ్ణి మీ దగ్గర వదలివెళ్తాం. ఏమీ అనుకోకుండా తీసుకోండి. అమెరికా తీసుకెళ్దాం అంటే అక్కడకు రానివ్వరట" అని ఆయన బతిమిలాడితే కాదనలేకపోయాను.

ఆ విధంగా రామచిలుక మా ఇంట్లో చేరింది.

* * * * * * * * * * *

ఆఫీసులో ఇంకోసారి నేను రాసిన నోటులో తనకు నచ్చని అంశం ఉంటే అది సాకుగా, ఆఫీసరు ఆ ఫైలును నా మొహంకేసి విసిరేసి "మైండ్ యూ!నీవు బ్లడీ గుమాస్తావి. నీ హద్దులు మీరి రాయకు తెలిసిందా?" అని కసిరాడు.

ఆ సాయంకాలం ఇంటికి వచ్చిన తరువాత రామచిలుకను చూస్తే హఠాత్తుగా అనిపించింది. దానికీ, నాకూ చాలా పోలికలున్నాయని, కనబడే పంజరంలో రామచిలుక బందీ. కనపడని పంజరంలో నేను బందీని. ఇనుప ఊచల పంజరం దానిది. పరిస్థితుల పంజరం నాది.

నా అన్న వారెవరూలేని ఒంటరి ఖైదీ ఆ చిలుక. నా అన్న వారున్నా ఒంటరిని, ఖైదీని నేను.

హఠాత్తుగా తోచింది. అయ్యో! ఆ చిలుకనిలా పంజరంలో బంధించి దాని స్వేచ్ఛనపహరించడం పాపం కదా! అని వెంటనే లేచి ఆ పంజరం తలుపు తెరిచాను. తక్షణం ఆ రామచిలుక నావైపు కృతజ్ఞతగా చూచి రెక్కలు విదిలించుకుని రివ్వున నీలాకాశంలోకి ఎగిరిపోతుంది– అని అనుకున్నాను. కానీ అది పంజరంలోనే ఉంది. ఒక జామపండు ముక్కను ఎరగా చూపించి, దాన్ని తలుపు దగ్గరకు రానిచ్చి, ఒడిసిపట్టి నా చేతుల్లోకి తీసుకున్నాను.

"ఎగిరిపోవే రామచిలుకా!" అని దాన్ని వదలిపెట్టాను.

"ఊహూ!" అది పోలేదు.

రెక్కలల్లార్చుకుంటూ ఆ గదిలోనే కొద్దికొద్దిగా గంతులు వేసినట్లు ఎగిరి, అక్కడ

కాసేపు, ఇక్కడ కాసేపు కూర్చుని చివరకు పంజరంలోకే వెళ్ళడానికి ప్రయత్నించింది.

నాకు నవ్వూ, ఏడుపూకూడా వచ్చాయి. పంజరానికి అలవాటుపడ్డ ఆ చిలుకకు స్వేచ్ఛ అంటే తెలిసిరాలేదు. నీలాకాశం దానికవసరం లేకపోయింది.

సరే! దానిలాగే నేనూ జీవితం వెళ్ళబుచ్చుతున్నాను.

ఆ రోజునుంచీ సాయంకాలాలు మాత్రం పంజరం తలుపు తెరిచే ఉంచుతున్నాను.

ఆఫీసులో హింస రోజురోజుకు హెచ్చుతూ వుంది. అవమానం పొందని రోజు ఆనందమైన రోజు అనుకునేంతగా దిగజారింది నా పరిస్థితి.

నాలాగే బాధలుపడ్డ యాదయ్య ఒకరోజు హఠాత్తుగా వచ్చి చెప్పాడు.

"సార్! నేను వాడిదగ్గర ప్యూను ఉద్యోగం చెయ్యనుసార్! రాజీనామా ఇచ్చేశాను".

"అదేమిటయ్యా సంసారం ఎట్లా గడుస్తుంది? అని నేనడిగితే "రిక్షా తొక్కుతాను సార్!" అన్నప్పుడు వాడి కళ్ళల్లో వెలిగిందే... అదే స్వేచ్ఛ ప్రసాదించే ప్రాణవాయువు యొక్క కాంతి.

"చదువుకోని వాణ్ణి నేనే బతకగాలేంది, సార్ చదువుకున్నవారు మీరెందు కిల్లాంటి పనికి వాడిదగ్గర గులాంలాగ ఉండాలి. ట్యూషన్లు చెప్పకోవచ్చు. బండిమీద గారెలమ్ముకోవచ్చు. బ్యాంకు అప్పతీసుకుని వ్యాపారం పెట్టుకోవచ్చు. ఏదన్నా చెయ్యవచ్చుగాని ఈ బానిస బతుకు బతకొద్దుసార్" అన్న యాదయ్య నాకు ఆదిశంకరాచార్య అంత ఎత్తుగా కనిపించాడు.

అవే మాటలు చెవిలో గింగురు మంటుండగా ఇల్లు చేరాను.

ఒక విచిత్రం జరిగింది. ఆ సాయంకాలం ఎక్కణ్ణించి వచ్చిందో ఒక కొత్త చిలుక మా ఇంటి బయటవున్న గానుగచెట్టుమీద కూర్చుని కిచకిచలాడుతూంది. ఉండుండది మా వరండాలోకి దిగివచ్చి మా ఇంటి చిలకనేదో పలుకరిస్తున్నట్లు అరుస్తోంది. మా చిలుక వింతగా చూసి ఏదో సమాధానాలిస్తోంది.

ఆ చిలుక పలుకుల వెనుకవున్న వేదాలేమిటో మరి!

నేను లోపలికి వెళ్ళి స్నానంచేసి దేవుడి దగ్గర సాయందీపాన్ని వెలిగించి దండంపెట్టి బయటికొచ్చాను.

ఆశ్చర్యం! వరండాలో పంజరం ఖాళీగా ఉంది. చిలక పంజరాన్ని వదిలింది. స్వేచ్ఛగా మేఘాల్లోకి ఎగిరిపోయింది. నాకు కొత్తగా ప్రాణం వచ్చినట్టయ్యింది.

గబగబా లోనికివచ్చి కాగితం, కలం తీసుకున్నాను.

రాజీనామా ఉత్తరం రాయడం మొదలెట్టాను.

*('ఉదయం' వారపత్రిక, మార్చి '91)*